TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 107 | శనివారం, ఆగస్టు 17, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### ఎస్ఎస్ ఎల్ వి డి3 ప్రయోగం

## విజయవంతం



శ్రీహరికోట: ఎస్ఎస్ఎల్ వి-డి3 ప్రయోగం విజయవంతమైంది. మొత్తం 17 నిమిషాల పాటు ఎస్ఎస్ఎల్ వి డి3 ప్రయోగం సాగింది. 175 కిలోల ఇఒఎస్08 ఉప్రగహాన్ని కక్ష్యలోకి వాహన నౌక ప్రవేశపెట్టింది. విపత్తుల నిర్వహణలో ఇఒఎస్ 08 ఉపగ్రహం సమాచారం ఇవ్వనుంది. ఈ ఉపగ్రహం పర్యావరణం, ప్రకృతి విపత్తులను పర్యవేక్షించనుంది. ఇస్రోకు చెంది యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ తయారు చేశారు. ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్ ఫ్రారెడ్ పేలోడ్ చిత్రాలను ఉపగ్రహం తీయనుంది. విపత్తుల నిర్వహణకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో చైర్మన్ డిఎస్ సోమనాథ్ తెలిపారు.

### ఎంఎల్‌సిలుగా కోదండరామ్, ఆమెర్...

## ప్రమాణ స్వీకారం



హైదరాబాద్: ఎమ్మెల్సీలుగా టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ తీర్పును వెలువరించింది. దీంతో ఎమ్మెల్సీల నియామకంపై ఎట్టకేలకు వివాదానికి తెరపడింది. ఈ మేరకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన ఛాంబర్‌లో వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్సీ మహేష్ కూమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తాజాగా సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హైకోర్టు ఆదేశాలపై స్టే ఉంటుందని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం స్పష్టం చేసింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా అడ్డుకునేలా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా అందుకు ధర్మాసనం నిరాకరించింది.

### జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల

## షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను శుక్రవారం విడుదల చేసింది. జమ్మూకశ్మీర్ లో మూడు దశలలో ఎన్నికలు జరుగుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. జమ్మూకశ్మీర్ లో మొత్తం 90 స్థానాలలో సెప్టెంబర్ 18న 24 స్థానాలకు, 25న 26 స్థానాలకు, అక్టోబర్ 1న 40 స్థానాలకు పోలింగ్ జరుగనున్నది. కాగా హర్యానాలో మొత్తం90 స్థానాలకు అక్టోబర్ 1న పోలింగ్ జరుగనున్నది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4న ఒకేసారి వెల్లడించనున్నారు.

## కెటిఆర్ సంచలన ప్రకటన



హైదరాబాద్: రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ రూ. 2 లక్షల రుణమాఫీపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ విజయవంతం అయిందని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుం టానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కాలేదని, కాకపోతే వారి కుటుంబ పర్యటన మాత్రం బ్రహ్మాండంగా సక్సెస్ అయిందన్నారు. ఆదాయపు పన్ను చెల్లించారని, రేషన్ కార్డులేదని చాలా మంది రైతులకు రుణమాఫీ చేయలేదని కెటిఆర్ అన్నారు. అర్హులందరికీ రుణమాఫీ అయిందని రేవంత్ రెడ్డి నిరూపిస్తే, తాను తన ఎంఎల్ఏ పదవికి రాజీనామాచేస్తానని, రాజకీయ సన్యాసం తీసుకుంటానని కెటిఆర్ స్పష్టం చేశారు. సెక్యూరిటీ లేకుండా ఏ నియోజకవర్గానికి అయినా మీడియాను తీసుకొస్తే... చర్చకు తాము సిద్ధమని కూడా అన్నారు.

### రేవంత్ రెడ్డికి కెటిఆర్ చురక

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో అమెరికా అధ్యక్షుడు కాబోతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం కాబోతుందని, కెసిఆర్ గవర్నర్, కెటిఆర్ కేంద్రమంత్రి కాబోతున్నారని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కెటిఆర్ కౌంటర్ ఇచ్చారు.

### కేటీఆర్‌కు మహిళా కమిషన్

## నోటీసులు

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్... కేటీఆర్ వ్యాఖ్యలపై విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. ఆగస్టు 24న కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసుల్లో సూచించింది. బిఆర్ఎస్ విలీనమంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కెటిఆర్ మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి చెప్పినటుంటి స్టోరీలు తాను కూడా చాలా చెప్పగలనన్నారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడు.

### రాఖీ పౌర్ణమి..

### అరుణాచలానికి ఆర్టీసీ

## ప్రత్యేక బస్సులు

హైదరాబాద్: రాఖీ పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు హైదరాబాద్-2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ప్రత్యేక బస్సు ఈనెల 17న రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయల్దేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. 19న మధ్యాహ్నం తిరిగి బయల్దేరి 20వ తేదీన హైదరాబాద్ చేరుకుంటుందని ఆయన చెప్పారు. ఒక్కరికి టికెట్ చార్జీగా రూ.3,600 చెల్లించాలని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోడానికి ముందుగా సీట్లను రిజర్వు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను డిపో మేనేజర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### పాకిస్థాన్‌కు చేరిన

## మంకీపాక్స్

న్యూఢిల్లీ: మంకీపాక్స్ (ఎంపాక్స్) వైరస్ ఆఫ్రికా ఎల్లలు దాటి పాకిస్థాన్‌కు చేరింది. దేశంలో మూడు ఎంపాక్స్ కేసులను గుర్తించారు. ఈ వైరస్ గ్రస్త లక్షణాలతో ఉన్న ముగ్గురు రోగులను ఇప్పటివరకూ గుర్తించడం జరిగిందని అధికారులు శుక్రవారం తెలిపారు. ఒక్కరోజు క్రితమే ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్ఒ మంకీపాక్స్‌పై గ్లోబల్ ఎమర్జెన్సీని ప్రకటించింది. పలు దేశాలూ అప్రమత్తం అయ్యాయి.



పాకిస్థాన్‌లో ఈ కేసులు వెలుగులోకి రావడంతో ఈ వైరస్ తలెత్తిన తొలి ఆసియా దేశం పాకిస్థాన్ అయింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎయిర్‌పోర్టులలో వైద్య పరీక్షల స్క్రీనింగ్ విధానాలను మరింత పెంచాలని పాక్ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయించింది. వేగవంత వ్యాప్తి లక్షణాల ఎంపాక్స్ వైరస్ వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫఖ్తూన్‌క్వా ప్రాంతంలో తలెత్తింది. ఈ విషయాన్ని ఈ ప్రాంత ఆరోగ్య విభాగం సంచాలకులు సలీం ఖాన్ తమ ప్రకటనలో నిర్ధారించారు.

### బంగ్లాదేశ్‌లో హిందువులకు...

# భద్రత కల్పిస్తాం

### - ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హిందువులకు, ఇతర మైనారిటీ వర్గాలకు రక్షణ, భద్రత కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోడీకి బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ శుక్రవారం ఫోన్‌లో హామీ ఇచ్చారు. షేఖ్ హసీనా ప్రభుత్వ పతనానంతరం యూనస్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయనకు, మోడీకి మధ్య జరిగిన తొలి ఫోన్ సంభాషణ ఇదే. ప్రజాస్వామిక, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీలక బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుందని తాను పునరుద్ఘాటించినట్లు ప్రధాని మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. 'జిఒబి ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్ నుంచి ఒక టెలిఫోన్ కాల్ అందుకున్నాను. ప్రస్తుత పరిస్థితిపై అభిప్రాయాలు పంచుకున్నాం. ప్రజాస్వామిక, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీలక బంగ్లాదేశ్‌కు భారత మద్దతును పునరుద్ఘాటించాను. బంగ్లాదేశ్‌లో హిందువులు, అన్ని ఇతర మైనారిటీలకు రక్షణ, భద్రతకు ఆయన హామీ ఇచ్చారు' అని మోడీ తన పోస్ట్‌లో తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీల భద్రత గురించి ప్రధాని మోడీ గురువారం తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఆందోళన వెలిబుచ్చారు. 'ఒక పొరుగు దేశంగా బంగ్లాదేశ్‌లో పరిణామాల పట్ల ఆందోళనను అర్థం చేసుకోగలను. అక్కడ పరిస్థితి త్వరలో సర్దుకుంటుందని ఆశిస్తున్నా' అని మోడీ తెలిపారు. మంగళవారం, మిస్టర్ యూనస్ రాజధాని ఢాకాలోని ఢాకేశ్వరి ఆలయాన్ని సందర్శించినప్పుడు బంగ్లాదేశ్‌లోని హిందువులను చేరుకున్నారు. మాజీ ప్రధాని షేక్ హసీనాను గద్దె దించిన తర్వాత ఇటీవల జరిగిన హింసాకాండలో మైనారిటీలపై దాడి చేసిన వారిని శిక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులు మరియు ఇతర మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విజువల్స్‌తో అనేక నివేదికలు వచ్చాయి.

### రాహుల్ గాంధీ పౌరసత్వాన్ని సవాల్ చేసి

## సుబ్రమణ్యన్ స్వామి పిల్



న్యూఢిల్లీ: బిజెపి నేత సుబ్రమణ్యన్ స్వామి శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో సంచలనాత్మక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) దాఖలు చేశారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆయన రాసిన లేఖపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలని హెూం శాఖకు ఆదేశించేలా హైకోర్టును కోరారు. తన తరపున న్యాయవాది సత్య సభర్వాల్ పిల్ దాఖలు చేసినట్లు ఆయన ఎక్స్ వేదిక లో ప్రకటించారు.

విదేశీ పౌరసత్వం అంశంపై రాహుల్ గాంధీని హెూం శాఖ ఎందుకు విచారించడంలేదన్న ప్రశ్నను ఆయన తాజాగా లేవనెత్తారు. యూకెలో బ్యాకప్స్ లిమిటెడ్ పేరుతో ఉన్న కంపెనీలో డైరక్టర్ గా రాహుల్ గాంధీ ఉన్నారని, అందులో బ్రిటిష్ జాతీయుడిగా పేర్కొన్నారని సుబ్రమణ్యస్వామి తెలిపారు. రెండు దేశాల పౌరసత్వాలను ఏక కాలంలో కలిగి ఉండటం అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 9తో పాటు భారత పౌరసత్వ చట్టం 1955 కింద ఉల్లంఘణ కిందికే వస్తుందని సుబ్రమణ్యన్ స్వామి తన లేఖలో పేర్కొన్నారు.



# బాస్ అనుమతి ఇవ్వలేదు.. అందుకే

ముంబయి, ఆగస్ట్ 16: జమ్మూ కశ్మీర్‌తోపాటు హరియాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ శుక్రవారం వెల్లడించారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకపోవడంపై ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ వివరణ ఇచ్చారు. **స్పందించిన ఆదిత్య ఠాక్రే..** దీనిపై ఆ రాష్ట్రంలోని శివసేన (యూబీటీ) నేత, మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే స్పందించారు. మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల నిర్వహించేందుకు ఎన్నికల సంఘానికి 'బాస్' అనుమతి ఇవ్వలేదంటూ పరోక్షంగా ప్రధాని మోదీని విమర్శించారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగు పడ్డాయంటూ మోదీ ప్రభుత్వం గత కొంత కాలంగా ప్రచారం చేస్తుందని గుర్తు చేశారు. కానీ ఇటీవల కాలంలో జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు పెచ్చురిల్లాయన్నారు. దీంతో ఆ రాష్ట్రంలో సామాన్య మానవుడికి రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం పునరుద్ఘాటించిందని ఆదిత్య ఠాక్రే స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగు పడ్డాయంటూ మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ద్వారా ఫుల్ స్టాప్ పడినట్లు అయిందన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తున్న తీరు పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రజలు ఇప్పటికే ఆ పార్టీని ఒకసారి తిరస్కరించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఆ పార్టీని మరోసారి ప్రజలు తిరస్కరిస్తారని ఆదిత్య ఠాక్రే జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని దోచుకునే విధంగా 'వాళ్ల కాంట్రాక్టర్లు'కు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లుగా ఉందని ఆదిత్య ఠాక్రే అభిప్రాయపడ్డారు. మరోవైపు.. జమ్మూ కశ్మీర్‌లో శాంతి భద్రతల దృష్ట్యా ముందుగా ఆ రాష్ట్రంతోపాటు హరియాణా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. అదీకాక మహారాష్ట్రలో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. అలాగే ప్రాంతీయ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా వరుసగా పితృపక్షాలు, దీపావళీ, వినాయక చవితి పర్వదినాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. అదీకాక.. సెప్టెంబర్ 30వ తేదీ లోపు జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అలాగే హరియాణా, మహారాష్ట్రతోపాటు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది లోపు నిర్వహించాల్సి ఉందన్న సంగతి అందరికి తెలిసిందే.

# ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యంగ్ లియూతో రేవంత్ భేటి



ఢిల్లీ: ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని ఆయన తెలిపారు. ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది.

హైదరాబాద్ నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను రేవంత్ ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును తెలియజేశారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు.. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నా మన్నారు. నవ తరం పరిశ్రమల అవసరాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో ఆయా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్రను ఛైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ ఛైర్మన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్ కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు అవసరమైన మద్దతు అందజేస్తామని ముఖ్యమంత్రి ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూకి హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్ యాంగ్ లియూకి వివరించారు.

**మీ విజన్ అద్భుతం --- యాంగ్ లియూ..**

ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ యాంగ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. తాను సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ , సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని ఆయన చెప్పారు.

ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్సటర్నల్ ఎంగేజ్‌మెంట్), ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ, ఫాక్స్ కాన్ నుంచి సంస్థ ఎస్బీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్, సీబీజీ జీఎం జొ వూ, చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సీఎస్‌బీజీ డిప్యూటీ జీఎం సూ, షో కూ, సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్, సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ ఎన్నికల వేళ సీఎంకు షాక్..

# బీజేపీ గూటికి చంపయి సోరెన్..?





రాంచీ: రాజకీయాల్లో ఎప్పుడేది జరుగుతుందో ఎవరూ చెప్పలేం. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కు మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ గుడ్‌బై చెప్పనున్నారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నారు. ప్రస్తుతం హేమంత్ సోరెన్ ప్రభుత్వంలో చంపయి సోరెన్ మంత్రిగా ఉన్నారు. బీజేపీ లీడర్లతో ప్రస్తుతం ఆయన సంప్రదింపులు జరపుతున్నారని, త్వరలోనే ఆయన కాషాయం కండువా కప్పుకోనున్నారని భోగట్టా. చంపయి సోరెన్‌తో పాటు జార్ఖండ్‌ముక్తి మోర్చా ఎమ్మెల్యే లాబిన్ హెంబ్రోమ్ కూడా బీజేపీలో చేరవచ్చని తెలుస్తోంది. పలువురు జేఎంఎం ఎమ్మెల్యేలు సైతం హేమంత్ సోరెన్‌ను విడిచిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. జేఎంఎం నేతలు ఇప్పటికే కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలుసుకునేందుకు ఢిల్లీకి వెళ్లినట్టు కూడా తెలుస్తోంది. అయితే, ఇటు జేఎంఎం కానీ, అటు బీజేపీ కానీ అధికారికంగా ఈ విషయాన్ని ఇంకా ధ్రువీకరించడం లేదు. చంపయి సోరెన్ గత ఫిబ్రవరిలో హేమంత్ సోరెన్ స్థానంలో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. నాటకీయ పరిణామాల మధ్య ఐదు నెలల తర్వాత మళ్లీ హేమంత్ సీఎం పగ్గాలు తన చేతుల్లోకి తీసుకున్నారు. మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు కాకముందు చంపయి సోరెన్‌కు సీఎం పగ్గాలు అప్పగించారు. హైకోర్టు బెయిలు మంజూరు చేయడంతో జూన్ 28న హేమంత్ విడుదలయ్యారు. ఆ వెంటనే జేఎంఎం లెజిస్లేచర్ పార్టీ నేతగా హేమంత్ తిరిగి ఎన్నిక కావడం, చంపయి సోరెన్ రాజీనామా చేయడంతో హేమంత్ తిరిగి సీఎంగా బాధ్యతలు చేపట్టడం చకచకా జరిగిపోయాయి.

### రేవంత్‌కు బండి రివర్స్ పంచ్...

# మీ పార్టీలోనే బీఆర్ఎస్

హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ సీఎం రేవంత్ రెడ్డికి రివర్స్ పంచ్ వేశారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని, కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ, కవితకు రాజ్యసభ సీటు రావడం ఖాయమని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనమవుతుందని, కవితకు బెయిల్ వస్తుందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బండి సంజయ్ ఈ విధంగా కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.



ఆమ్ ఆద్మీ పార్టీని విలీనం చేసుకుంటేనే ఆ పార్టీ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చిందా ? అని ఎద్దేవా చేశారు. సీఎం పదవిలో ఉండి రాజకీయ లబ్ధి కోసం గౌరవ న్యాయస్థానంపై బురదజల్లి కోర్టుల ప్రతిష్ఠను దిగజార్చడం సరికాదన్నారు. బీజేపీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. పొత్తు పెట్టుకొని పదవులు పంచుకున్న చరిత్ర కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకే ఉందని గుర్తు చేశారు. ఇందులో బీజేపీకి ఏం సంబంధమో చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌ను విలీనం చేస్తే బెయిల్ వస్తుందనడం మూర?త్వమే అన్నారు. కవితకు బెయిల్ విషయంలో కావాలని బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను ఎందుకు అరెస్ట్ చేయలేదు ? అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయం అన్నారు. ప్రజలు ఛీత్కరించుకున్న పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ తమకు లేదన్నారు.

బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ తహతహలాడుతోందన్నారు. పథకం ప్రకారమే ఆ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. రాజ్యసభ ఎన్నికలు వస్తున్నాయని... కాంగ్రెస్ ఉబలాటం చూస్తుంటే కవితను రాజ్యసభకు పంపినా ఆశ్చర్యం లేదని ఎద్దేవా చేశారు. ఆ పార్టీల తీరు "నేను కొట్టినట్లు చేస్తా... నువ్వు ఏడ్చినట్లు చెయ్" అన్నట్లుగా ఉందన్నారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం సహా అనేక అంశాల్లో జరిగిన కోట్లాది రూపాయల అవినీతి, అక్రమాలను వెలికితీసి కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపించాలన్నారు.

### హైదరాబాద్‌కు రెడ్ అలెర్ట్...

# భారీ వర్ష సూచన



తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ లో కూడా ఎడతెరిపిలేకుండా వానలు పడుతున్నాయి. నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు వరద ముంపులో చిక్కుకుపోయాయి. కాగా, రాత్రికి మరింత కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని తాజాగా హైదరాబాద్ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నగరంలో భారీగా వర్షాలు పడతాయని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలోనే నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు. ఏదైనా సహాయం కోసం 040 21111111కు ఫోన్ చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. వర్షం కారణంగా హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. లక్డీకపూల్, ఖైరతాబాద్, అమీర్ పేట, ఖాజాగూడ జంక్షన్, మల్కంచెరువు, బయోడైవర్సిటీ కూడలి, ఐకియా జంక్షన్, గచ్చిబౌలి తదితర ప్రధాన రహదారులపై వాహనాలు బారులు తీరాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# బీహార్‌కు మరో ఎయిర్‌పోర్టు

బీహార్ రాజధాని పాట్నాలో రెండవ విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. భిహ్తాలోని భారతీయ వైమానిక దళ స్థావరాన్ని ఇక పౌర వైమానిక సముదాయంగా మార్చే ప్రతిపాదనకు కేంద్రం సమ్మతి తెలిపింది. ఈ నూతన విమానాశ్రయ నిర్మాణానికి రూ 1,413 కోట్ల నిర్మాణ వ్యయ ప్రతిపాదనలకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ భేటీ జరిగింది. వివరాలను కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. కాగా బెంగాల్‌లోని బాగ్డోగ్రా ఎయిర్‌పోర్టుకు రూ 1549 కోట్లతో నూతన టర్మినల్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. పాట్నాలో ఇప్పుడున్న ఎయిర్‌పోర్టు ప్రయాణికుల రాకపోకలకు తగినట్లుగా లేనందున నూతన విమానాశ్రయం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. పాట్నాలోని ఎయిర్‌పోర్టుకు 24 కిలో మీటర్ల దూరంలోనే బిహ్టా ఐఎఎఫ్ స్థావరం ఉంది. ఇక్కడనే పాట్నా కొత్త ఎయిర్‌పోర్టు వెలుస్తుంది.



### గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల...

# టైమింగ్స్ మార్పు

హైదరాబాద్: తెలంగాణలో టీజీపీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల వేళల్లో మార్పులు చేశారు. ఈ మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ జరగనున్న సంగతి తెలిసిందే.. కాగా, అసలు షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగాల్సి ఉండగా.. అరగంట ముందే ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు.

**తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ 2024 ఎగ్జామ్ షెడ్యూలు..**

- అక్టోబర్ 21, 2024: జనరల్ ఇంగ్లిష్ (అర్హత సాధిస్తే చాలు) - అక్టోబర్ 22, 2024: పేపర్-1 (జనరల్ ఎస్సే)
- అక్టోబర్ 23, 2024: పేపర్-2 (హిస్టరీ, కల్చర్ అండ్ జాగ్రఫీ)
- అక్టోబర్ 24, 2024: పేపర్-3 (ఇండియన్ సొసైటీ, కానిస్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్) - అక్టోబర్ 25, 2024: పేపర్-4 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) - అక్టోబర్ 26, 2024: పేపర్-5 (సైన్స్ & టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్)
- అక్టోబర్ 27, 2024: పేపర్-6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర అవతరణ)

# సంపాదకీయం

శనివారం, ఆగస్టు 17, 2024

## అదానీ గ్రూపుతో సెబీ చీఫ్ కుమ్మక్కయ్యారా.?

18 నెలల క్రితం అదానీ గ్రూపు ఏకపక్ష సామ్రాజ్యాన్ని పునాదులతో కుదిపేసిన హిండెన్‌బర్గ్ కంపెనీ మరోసారి 'సమ్ థింగ్ బిగ్ న్యూస్ ఇండియా' అంటూ 'ఎక్స్' లో పేర్కొన్న గంటల వ్యవధిలోనే బాంబును పేల్చింది. అదానీ గ్రూప్ అక్రమంగా నిధులు మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో సెబీ చైర్ పర్సన్ 'మాధవి పురి బుచ్' తో పాటు ఆమె భర్త 'దవల్ బుచ్'కు రహస్య వాటాలు ఉన్నాయని అందుకే అదానీ వ్యాపార లొసుగులు, చట్ట వ్యతిరేక లావాదేవీలు వెలుగు చూడటం లేదని హిండెన్ బర్గ్ శనివారం తన వెబ్‌సైట్‌లో పోస్ట్ తీవ్రంగా ఆరోపించింది. విజిల్ బ్లోయర్' అందించిన పత్రాల ఆధారంగా సెబీ చీఫ్‌పై ఈ ఆరోపణలు గుప్పించింది. బుచ్ దంపతులు 'ఐపీఈ ప్లస్ ఫండ్ -1'లో ఖాతాలను 2015 జూన్ 5న సింగపూర్‌లో తెరిచారని, ఈ 'ఆఫ్ షోర్ మారిషస్ ఫండ్'ను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ 'ఇండియా ..ఇన్ఫోలైన్(ఐఐఎఫ్ఎల్)' ద్వారా అక్రమంగా తెరిచారని విజిల్ బ్లోయర్ పత్రాలను అనుసరించి తెలుస్తున్నదని హిండెన్ బర్గ్ పేర్కొంది. అయితే, మాధవి పురి బుచ్ సెబీలో చేరక ముందు జరిగిన విషయమిది. ఆమె 2017లో సెబీలో పర్మినెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఐఐఎఫ్ఎల్ ప్రిన్సిపల్ సంతకం చేసిన డిక్లరేషన్ ఆఫ్ ఫండ్స్ ప్రకారం.. విదేశీ ఫండ్లలో వీరి పెట్టుబడి జీతం ద్వారా సమకూరిందని పేర్కొనగా.. దంపతుల మొత్తం ఆస్తి కోటి డాలర్లు ( సుమారు 84 కోట్లు)గా ఉండవచ్చని అంచనా వేసింది. సెబీ చైర్ పర్సన్‌గా తన నియంత్రణ పరిధిలోకి వచ్చే వేలాది మ్యూచువల్ ఫండ్లు ఉండగా... తాను, తన భర్త మాత్రం అతి తక్కువ ఆస్తులతో కూడిన హై రిస్క్ ప్రాంతాల్లో ఏర్పాటైనా, అదానీ అక్రమ నిధుల మళ్లింపు కుంభకోణంతో సంబంధాలు ఉన్న మల్టీ లేయర్డ్ విదేశీ ఫండ్లలో పెట్టుబడి.. పెట్టారని కొన్ని పత్రాలు తెలుపుతున్నాయంది. ఈ షెల్ కంపెనీల ద్వారానే వినోద్ అదానీ నిధులను మళ్లించి అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించినట్లు హిండెన్ బర్గ్ గతంలోనే ఆరోపించింది. కాగా, హిండెన్‌బర్గ్ తాజాగా చేసిన ఆరోపణలపై సెబీ డైరెక్టర్ మాధవీ పురి బుచ్ ఆలస్యంగా స్పందించింది. తమకు అదానీ గ్రూప్ అక్రమాలతో సంబంధం లేదని తెలిపింది. అదానీ కూడా ఇదే విషయాన్ని బలపరిచాడు. అదానీ అక్రమాలపై తమ నివేదిక విడుదల చేసి 18 నెలలు అవుతున్నప్పటికీ, అదానీ కంపెనీలకు ఇతర షెల్ కంపెనీలకు ఉన్న అక్రమ లావాదేవీలను అదానీ బహిర్గతం చేయలేదని.. మారిషస్, ఇతర విదేశీ షెల్ కంపెనీలపై చర్యలు చేపట్టేందుకు సెబీ ఎందుకు విచారణను జాప్యం చేస్తోంది? సెబీ ఈ విషయంలో ఏమాత్రం ఆసక్తి చూపకపోవడం విస్మయం కలిగించిందని హిండెన్ బర్గ్ తన బ్లాగ్‌లో అభిప్రాయపడింది. అదానీ 'ఆఫ్ షోర్ ఫండ్లకు' ఎవరు నిధులు సమకూర్చారనే విషయాన్ని సెబీ తన దర్యాప్తు పత్రాల్లో ఖాళీగా ఉంచిందన్న సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఒకవేళ ఈ విదేశీ ఫండ్ హోల్డర్లను గుర్తించాలనుకుంటే సెబీ చైర్ పర్సన్ మీదనే విచారణ చేయాలి. కానీ తమ చీఫ్ గుట్టు విప్పే దర్యాప్తు జరిపేందుకు సెబీ ఇష్టపడకపోవడం తమకు ఆశ్చర్యం కలిగించలేదని హిండెన్ బర్గ్ పేర్కొంది. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడుతూ ఉండడంతో పాటు అనుచిత పద్ధతుల్లో గ్రూపు కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వస్తోందని 2023 జనవరి 24న విడుదల చేసిన నివేదికలో హిండెన్ బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన ఎల్ఐసీతో పాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. హిండెన్ బర్గ్ నివేదికలో స్టాక్ మార్కెట్‌తో పాటు కార్పొరేట్ రంగం భారీ కుదుపునకు లోనైంది. ఈ విషయంలో దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతో పాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో సెబీ చైర్ పర్సన్‌పై హిండెన్ బర్గ్ చేసిన ఆరోపణల నిగ్గు తేల్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)వేయాలని ప్రతి పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాక ఈ స్కాంను సుప్రీంకోర్టు స్వయంగా సుమోటోగా తీసుకోవాలని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. గతంలో అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్ బర్గ్ నిర్దిష్ట ఆరోపణలు చేసినప్పుడు.. సుప్రీంకోర్టు స్వయంగా తన పర్యవేక్షణలో అదానీ గ్రూప్ కార్యకలాపాలపై నేరుగా విచారణ జరపకుండా "దొంగ చేతికి తాళాలు అప్పగించినట్లు" సెబీని విచారణ సంస్థగా దర్యాప్తు చేయమంది. ఇప్పుడు సాక్షాత్తు సెబీ చీఫ్ పైనే ఆరోపణలు వస్తున్న క్రమంలో ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు వేగంగా జరపాలని మిగతా విపక్షాలు కూడా ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. అలాగే ఆమె డైరెక్టర్ పదవి నుండి తప్పుకొని విచారణకు సహకరించాలని విపక్షాలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నాయి.

## పారెవుల పంప్ హౌస్ నుండి మరో పంపు ద్వారా నీటి విడుదల చేసిన మక్తల్ నియోజవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి





మక్తల్ ఆగస్టు 16

మక్తల్ మండలంలోని పారెవుల గ్రామంలో మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా 3వ నూతన పంపుల ద్వారా నీటి విడుదలను ప్రారంభించి, త్రాగు మరియు సాగు కొరకు నీటిని విడుదల చేసిన మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అనంతరం పంప్ హౌస్ ను పరిశీలించారు. నీటిని వృతగా పోనివ్వకుండా సరైన విధంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు

## అట్టడుగు ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందలేదు

### - మతోన్మాదుల చెర నుండి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

### - కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు




ఆగస్టు16: మహబూబ్నగర్:

77 ఏళ్ల తర్వాత కూడా ఆ స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు ప్రజలకు అందలేదని కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు పాలకవర్గాలు ఎర్రతివాచి పరిచి అట్టడుగు ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని, స్వాతంత్ర ఫలాల సంరక్షణ కోసం దేశంలో ధర్మ యుద్ధం చేయటానికి యువతరం నడుంబిగించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 78 ఏళ్ల స్వాతంత్రం రాజ్యాంగ ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు ఈ సెమినార్ కు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లెల మాణిక్యంరాజు అధ్యక్షత వహించారు ప్రధాన వక్తగా పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ ఆకలి సూచికలో 111వ స్థానానికి చేరిందన్నారు .40 కోట్ల నిరుద్యోగ సైన్యం పెరిగిందని,46కోట్ల మంది ప్రజలు దారిద్ర రేఖకు దిగువన నివసిస్తున్నారని చెప్పారు మరోవైపు 169 మంది శతకోటీశ్వరులు ఎదిగి ఆధాని ప్రపంచంలో నెంబర్ 2 కుబేరుడుగా అయ్యాడని చెప్పారు. 40 శాతం మంది ప్రజల ఆస్తి ఒక శాతం చేతుల్లో మగ్గుతుందని ఈ ఆర్థిక అంతరాలు పెరుగుతున్న తీరు దేశాన్ని మరింత దిగజార్చే వైపు నడిపిస్తుందన్నారు సామాజికంగా కుల వివక్ష అంటరానితనం నేటికీ కొనసాగుతుందన్నారు దళితులపై దాడులు దౌర్జన్యాలు



పెట్రేగిపోతున్నాయని బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులు మహిళలు మైనారిటీలపై 300 రెట్లు పెరిగాయన్నారు దళితుల హత్యల్లో బిజెపి పాలిత యూపీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు మహిళలపై గ్యాంగ్ రేప్ లో మధ్యప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు .సామాజిక ఆర్థిక అంతరాలను తొలగించకపోతే దేశంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి యువతరం నడుం బిగించాలన్నారు మతోన్మాదుల చెర నుండి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు రాజ్యాంగ మూల స్తంభాలై ప్రజాస్వామ్యం ఫెడరలిజం లౌకికతత్వం సామాజిక న్యాయాలను బిజెపి వాటి పునాదుల నుండి పెకిలిస్తుందన్నారు బంగ్లాదేశ్ లో జరుగుతున్న పరిణామాలను పరిశీలించినప్పుడు మెజారిటీ మతోన్మాద అధిపత్యం ఎక్కడ ఉంటే అక్కడ మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు బంగ్లాదేశ్ లో హిందువులపై మెజారిటీ మతోన్మాదులుగా ఉన్న ముస్లింలు దాడులు చేస్తున్నారని ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు కానీ భారతదేశంలోనే మణిపూర్ లో ఇద్దరు గిరిజన యువతులను నగ్నంగా ఊరేగింపు చేసినప్పుడు ఈరోజు గొంతు చించుకుంటున్న మతోన్మాదులు ఆనాడు ఎందుకు నోరు విప్పలేదని విమర్శించారు మతోన్మాదం ఏ దేశంలో ఉన్న ప్రమాదమేనని దాన్ని భారత రాజ్యాంగం అంగీకరించదన్నారు మతసామరస్యం లౌకిక విలువల పరిరక్షణ కోసం భారతదేశ సమైక్యత సమగ్రతల కోసం యువతరం మతోన్మాదుల దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మీసాల కురుమయ్య కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆది విష్ణు సంకర రాములు హాస్టల్ విద్యార్థులు క్రాంతి కురుమూర్తి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించండి

### -కల్వకుర్తి డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాం పవన్




కల్వకుర్తి,ఆగష్టు 16:

యావత్తు ప్రపంచవ్యాప్తంగా మహిళా డాక్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టి మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని కల్వకుర్తి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాం పవన్ అన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన కోలకత్త లోని ఆర్జీ కేర్ ఆస్పత్రిలో రెసిడెంట్ వైద్యురాలని అత్యాచారం చేసి హత్య చేసి చంపిన దుండగులను వెంటనే శిక్షించాలని శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని వైద్యులందరూ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో శాంతియుత నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్ పవన్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడుతూ, ప్రతినిత్యం ప్రజాసేవ పరమావధిగా భావించే వైద్యులపై అత్యాచార%శీ% చేసి హత్య చేయడం సభ్య సమాజానికి సిగ్గుచేటు అని అన్నారు. వైద్యులపై దురుసుగా ప్రవర్తించే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. వైద్యురాలు రమ్య మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మరలా జరగకుండా దోషులను గుర్తించి కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్యులందరూ ఓపి సేవలు నిలిపివేస్తున్నట్టు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, ప్రజాసంఘాలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం





కల్వకుర్తి ఆగష్టు 16:

కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దద్దం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం పట్ల బిఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమ ర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం ఉచితంగా బస్సు ప్రయాణం అమలు చేస్తే వారి పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేయడం కేటీఆర్ కు తగదని అన్నారు. ఈ కార్యక్ర మంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి కౌన్సిలర్ ఎజాజ్, మైనార్టీ నాయకురాలు రేష్మ బేగం, రెహానా, సంతు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు తదితరు పాల్గొన్నారు.

## ఉత్తమ ఏపీఎం గా కోట్ల జీవరత్నం



నవాబుబ్ పెట్: ఆగస్టు16:

జిల్లా కేంద్రంలోని పెరేడ్ గ్రౌండ్ లో 78 వ స్వాతంత్ర దినోత్సవం ను పురస్కరించుకొని నవాబుబ్ పెట్ మండల గ్రామీణాభివృద్ధి శాఖ(డి ఆర్ డి ఏ)లోపనిచేస్తున్న ఏపీఎం కోట్ల జీవరత్నం కు గురువారం ఉత్తమ ఏపీఎం అవార్డును జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు,కలెక్ట్ విజయేంద్ర బోయి చేతులమీద అందుకున్నందులకు పలువురు అభినందించారు. ఆగస్టు మాసంలో మూడువందల ముపైఎనిమిది మహిళాసంఘలకు పదికోట్ల ఆరువై మూడు లక్షలుటార్గెట్ తీసుకొని నూట ఇరువైనాల్గు మహిళాసంఘలకు పదకొండు కోట్ల పద్నాలుగు లక్షల రూపాయలను బ్యాంక్ లింకేజీ ద్వారా అచిఈవ్ మెంట్ కావడం తో ఈ అవార్డ్ లభించడం చాలా సంతోషంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అవార్డ్ రావటానికి కృషి చేసిన సి సి లు కాంచనమాల,బాలరాజు,రమాదేవి,కృష్ణయ్య,రామాంజనేయులు,హరిత దేవి లకుఆయన కృతజ్ఞతలు తెలిపారు

## సవాయిగూడెం లోని పెళ్లి రిసెప్షన్ లో పాల్గొన్న -మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తి ఆగస్టు 16:

వనపర్తి మండలం, సవాయిగూడెంలోని జమ్ములతాండ బి.ఆర్.ఎస్ నాయకులు పాండునాయక్ కుమారుడు ఈశ్వర్ పెళ్లి రిసెప్షన్ కు హాజరైనా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. బి.ఆర్.ఎస్ నాయకులు రిటైర్డ్ టీచర్ గౌస్ ని పరామర్శించిన మాజీ మంత్రి 22 వ వార్డుకు చెందిన గౌస్ రిటైర్డు టీచర్ ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకుని సమాజసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కే.మాణిక్యం స్టార్ రైమ్ , జొహెబ్ హుసేన్ , మహేశ్వర్ రెడ్డి ,చిట్యాల రాము పి.శ్రీను,శ్రీను, అంజి నాయుడు, వజ్రాల రమేష్, దినేష్, కురుమూర్తి నాయుడు, చంద్రయ్య, శేఖర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## యువత స్వయంకృషితో ఎదగాలి తోటి యువకులకు ఆదర్శం కావాలి

### - టీ వరల్డ్ చాయ్ సెంటర్ ప్రారంభించిన జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి విజయ మోహన్ రెడ్డి




ఆగస్టు 16, అడ్డాకుల

మండల కేంద్రంలోని గోల్డెన్ హోటల్ ప్రక్కన కొత్తగా టీ వరల్డ్ చాయి హోటల్ ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి విజయ మోహన్ రెడ్డి హాజరై ఘనంగా ప్రారంభించారు. యువకులు స్వయంకృషితో ఎదగాలని ఆయన సూచించారు. టీ వరల్డ్ నూతన షాప్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం జరిగింది.. ప్రారంభోత్సవానికి పార్టీలకు అతీతంగా విచ్చేసిన ప్రజా ప్రతినిధులు, నాయకులకు, గ్రామ యువకులు. ప్రజలు. స్నేహితులు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు హోటల్ యజమాని కావాలి రాజు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. టి వరల్డ్ ఛాయ్ హోటల్ ద్వారా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటామని.... ఏ సమయంలోనైనా అందరికీ సేవలు అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట శ్రీహరి, బిజెపి మండల అధ్యక్షులు బుచ్చన్న యాదవ్, మాజీ ఎంపీటీసీ భీమన్న యాదవ్, రంగన్న గౌడ్, బిజెపి నాయకులు సురేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుదర్శన్ శ్రీనివాసులు గౌడ్, మోహన్ దాస్, గోపాల్ నాయక్, నరేష్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ద్రవిడ పార్టీల బాటలో గులాబీ పార్టీ




**హైదరాబాద్ :** కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. చూడడానికి బక్క పల్చని మనిషి. కానీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పార్టీని స్థాపించి.. శాంతియుద నిరసనలు, సంప్రదింపులు, లాబీయింగ్ ద్వారా స్వరాష్ట్రం సాధించి బక్కోన్ని కాదు బలవంతుడిని అని నిరూపించారు. ఇక స్వరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా కూడా ఆయనే అయ్యారు. వరుసగా రెండు పర్యాయాలు పార్టీని గెలిపించి దాదాపు తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణను పాలించారు. కొత్త రాష్ట్రమే అయినా తెలంగాణను అన్ని రంగాల్లో పెద్ద రాష్ట్రాలకు దీటుగా అభివద్ధి చేశారు. తాగు, సాగునీటి సమస్య పరిష్కరించారు. కొరెంటు కోతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దారు. ఇందతా ఒక్క రాత్రే జరగలేదు. దీని వెనుక కేసీఆర్ కషి, పట్టుదల, వ్యూహరచన, ప్రణాళిక ఉన్నాయి. కేసీఆర్ వ్యూహాలు ఎవరికీ అంత సులువుగా అర్థం కావు. అందుకే తెలంగాణ రాష్ట్ర సాధన, రెండుసార్లు అధికారంలోకి రావడం వెనుక ఆయన వ్యూహాలే కారణం. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ వ్యూహాలు ఫలించలేదు. అహంకారపూరిత మాటలు, కుటుంబ పాలన, ఉద్యోగాల భర్తీలో వివక్ష, తాను ఏం చేసినా చెల్లుతుందన్న ధోరణి బీఆర్ఎస్ ఓటమికి కారణమయ్యాయి. ప్రస్తుతం ప్రతిపక్షానికి పరిమితమైన గులాబీ బాస్ కేసీఆర్.. ఇప్పుడు రాజకీయ వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది. తననే ఎవరైనా ఫాలో కావాలని అనుకునే ఆయన.. ఇప్పుడ ద్రవిడ పార్టీని ఫాలో అవుతున్నారు.తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ నిర్మాణాన్ని కేసీఆర్ అధ్యయనం చేస్తున్నారు. డీఎంకే పార్టీకి, భారత రాష్ట్ర సమితికి కొన్ని పోలికలు ఉన్నాయి. రెండు పార్టీలు కూడా స్థానిక అంశాలను ప్రాతిపదికగా చేసుకొని ఏర్పడ్డవి. రెండు పార్టీల్లోనూ విపరీత ప్రాంతీయ వాదం.. తత్వం ఉంటుంది. రెండూ కూడా జాతీయ పార్టీలను వ్యతిరేకించే పార్టీలు.. ఒక వ్యక్తి సెంట్రిక్‌గా నిర్మాణమైన పార్టీలు. ఇందుకోసమే కేసీఆర్, డీఎంకే పార్టీ స్ట్రక్చర్‌పై అధ్యయనం చేస్తున్నారు. బీఆర్ఎస్ కన్నా ముందే డీఎంకేకి తమిళనాడులో బలమైన పునాదులు ఉన్నాయి. కానీ బీఆర్ఎస్ పార్టీకి ఆ స్థాయిలో బలమైన నిర్మాణం లేదు. అన్నా డీఎంకే ఎన్నిసార్లు అధికారంలోకి వచ్చినా డీఎంకే నుంచి చేరికలు లేవు.. కానీ ఇక్కడ మాత్రం పార్టీ ఫిరాయింపులు విపరీతంగా కనిపిస్తున్నాయి. ఈ విషయంపై దష్టి పెట్టారు కేసీఆర్. ఇందుకోసం మాజీ ఎమ్మెల్యే సుమన్ నేతత్వంలో ఒక బృందాన్ని చెన్నైకి పంపించారు. డీఎంకే ఎమ్మెల్యే శంకర్ ఈ బృందానికి పార్టీకి సంబంధించిన వివరాలను సవివరంగా వెల్లడించారు.డీఎంకేలో ప్రభుత్వం కన్నా పార్టీకే నేతలు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఎవరైనా ఎమ్మెల్యేని మంత్రి పదవి కావాలా..? జిల్లా అధ్యక్ష పదవి కావాలా..? అంటే జిల్లా అధ్యక్ష పదవి వైపే మొగ్గుచూపుతారు.. అక్కడ పార్టీకి అంతగా ప్రాధాన్యం ఇస్తారు.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు, కమిటీల మధ్య సమన్వయం చాలా బలంగా ఉంటుంది. పార్టీ కార్యాలయాలు ప్రతీరోజు ఏదో కార్యక్రమంతో యాక్టివ్ గా ఉంటాయి. ఎమ్మెల్యేలు మంత్రులు కూడా పార్టీ కార్యాలయాల్లో కార్యకర్తలకు ప్రతీరోజు అందుబాటులో ఉంటారు. పథకాల రూపకల్పన, అమలులోనూ పార్టీ సూచనలే కీలకంగా ఉంటాయి.చెన్నై వెళ్లిన బీఆర్ఎస్ బృందం డీఎంకే పార్టీ విధానాలు, అనుసరిస్తున్న తీరు, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సంబంధాలు, పార్టీకి నేతలు ఇచ్చే ప్రాధాన్యం తదితర అంశాలు తెలుసుకుంటున్నారు. వాటిని భారత రాష్ట్ర సమితిలోనూ ఇంప్లిమెంట్ చేయాలని గులాబీ బాస్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం చెన్నైలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ బృందం హైదరాబాద్ చేరుకున్న వెంటనే కేసీఆర్‌కు నివేదిక ఇస్తుంది. ఆ తర్వాత ముఖ్య నేతల టీం మరోసారి చెన్నై వెళ్తుంది. వచ్చేనెల చివరికి పార్టీలో మార్పులు చేర్పుల విషయంలో డీఎంకేను ఫాలో కావాలన్నది కేసీఆర్ ఆలోచన అని పేర్కొంటున్నారు..

# కుంకుడు సాగుతో లక్షల ఆదాయం



**నల్గొండ :** టా ఒకేరకమైన పంటలు సాగు చేయడం వలన దిగుబడి తగ్గుపోతోంది. దీంతో దిగుబడి కోసం రైతులు ఇష్టానుసారం రసాయన మందులు వాడడంతో భూమి నిస్సారం అవుతోంది. దీంతో సాగులో నష్టాలు వస్తున్నాయని చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. కొందరు సాగు వదిలేసి ఇతర పనులు చూసుకుంటున్నారు. పట్టణాలకు వలస పోతున్నారు. ఈ తరుణంలో కొంతమంది రైతుల వినూత్న పద్ధతిలో పంటలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో, తక్కువ మోతాదులో ఎరువులు వాడి ఎక్కువ దిగుబడి, లాభాలు ఆర్జిస్తున్నారు. వ్యవసాయాధికారుల సహకారం, సాంకేతిక పరిజ్ఞానంతో పంటల పండిస్తున్నారు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నల్గొండ జిల్లాకు చెందిన రైతు నీటి వసతి అంతగా లేని తన పొలంలో సంప్రదాయ పంటలకు భిన్నంగా వ్యవసాయం చేస్తున్నాడు. నీటి వసతి లేదని సాగును వదిలేసే రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. కరువు ప్రాంతంలో ఆయన చేపట్టిన వినూత్న ప్రయోగం.. ఇప్పుడు వారి ఇంట సిరులు కురిపిస్తుంది. సుమారు 33 ఏళ్లుగా ఆదాయం పొందుతున్నాడు. అది కూడా ఎకరాకు రూ.13 లక్షలు. ఎక్కువ సాగుభూమి ఉండి తక్కువ నీటి వసతి ఉన్న రైతులు చాలా మంది తమ పొలాలను బీడుగా వదిలేస్తారు. నల్గొండ జిల్లా రైతు లోకసాని పద్మారెడ్డి మాత్రం నీటి వసతి లేకపోయినా ఎకరాకు కేవలం రూ.5 వేల పెట్టుడితో 33 ఏళ్లుగా ఎకరాకు రూ.13 లక్షల ఆదాయం పొందుతున్నాడు. 12 ఎకరాల్లో పంట పండిస్తూ భారీగా ఆదాయం పొందుతున్నాడు. 33 ఏళ్ల క్రితం 12 ఎకరాల్లో 1,200 కుంకుడు మొక్కలు నాటాడు పద్మారెడ్డి. అప్పుడు అందరు ఆయనను పిచ్చివాడిలా చూశారు. కానీ ఇప్పుడు అదే కుంకుడు తోట మీద ఆయన లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం చూసి నోరె వెల్లబెడుతున్నారు.పద్మారెడ్డి 1991 లో నీటి వసతి పెద్దగా లేని తన 12 ఎకరాల వ్యవసాయ భూమిలో 1,200 కుంకుడు మొక్కలు నాటించాడు. ఇందుకు ఎకరాకు రూ.5 వేల చొప్పున ఖర్చు చేశాడు. వీటి సాగుకు పెద్దగా నీటి అవసరం లేదు. అందుకే పద్మారెడ్డి ఈ ఆలోచన చేశారు. ఆ చెట్లు పెరిగి పెద్దయి నాలుగేళ్ల తర్వాతి నుంచే దిగుబడి ఇవ్వడం మొదలైంది. ఒక్కసారి నాటిన వీఇని మూడు నాలుగేళ్లు శ్రద్ధగా కాపాడుకున్నాడు. ఆ తర్వాత నుంచి అతను ఊహించని విధంగా ఆదాయం వస్తోంది.కుంకుడు సాగులో పద్మారెడ్డి 33 ఏళ్ల అనుభవం గడించాడు. సాగు విధానం గురించి ఆయన చాలా మందికి సూచనలు చేస్తున్నారు. మొక్కల మధ్య 20చీ20 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలంటున్నాడు. వీటికి డ్రిప్‌తో నీటిని అందిస్తే సరిపోతుంది అంటున్నాడు. అంతేకాక కుంకుడు చెట్ల మధ్య తొలి మూడేళ్లు బొప్పాయి, మునగ, జామ వంటి పంటలు వేసుకుంటే రైతుకు అదనపు ఆదాయం వస్తుంది అంటున్నారు. పంట వేసిన నాలుగో ఏట నుంచి 20?30 కిలోల కాపు ప్రారంభమవుతుందన్నారు. ఐదేళ్ల తర్వాత పూత దశలో నీరు ఇస్తే చాలు. మంచి దిగుబడి వస్తుందని తెలిపారు పద్మారెడ్డి.ఏటా కుంకుడు పంట నవంబర్ ? డిసెంబర్ నెలల మధ్య పూతకు వస్తుంది. ఏప్రిల్‌లో కాయలు కోతకు వస్తాయి. కుంకుడు చెట్టు కాపు సీజన్ పూర్తయ్యాక ఆకు రాల్చి నిద్రావస్థలోకి వెళు ‌ంది. ఎండిన మానులా ఉండే చెట్టు మేలో చిగురిస్తుంది. ఒక్కో చెట్టుకు 20?25 కిలోల ఆకులు రాలుతాయి. ఆకులన్నీ చెట్టు మొదట్లోనే కుళ్లి సేంద్రియ ఎరువుగా పోషకాలను అందిస్తాయి. కుంకుడు మొక్కలను ఒక్కసారి నాటితే సుమారు 200 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తాయి. కిలో ఎండు కుంకుడు కాయలు రూ.130 పలుకుతోంది. నాణ్యమైన పొడికి మరింత డిమాండ్ ఉందని పద్మారెడ్డి తెలిపాడు.

# బావబామ్మర్దుల మధ్య కోల్డ్ వార్

**హైదరాబాద్ :** ళ్లిద్దరూ రాజకీయ ఉద్దండ కుటుంబం నుంచి వచ్చిన బావ బావమరుదులు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. మంత్రి పదవులలంకరించి పదేళ్లుగా తెలంగాణలో రాజకీయ చక్రం తిప్పారు. తీరా అధికారం లేకపోవడంతో ఇప్పుడు అధికార పక్షం మీద విమర్శనాస్త్రాలతో విరుచుకుపడుతున్నారు. అయితే వారిద్దరి మధ్య కొంతకాలంగా కోల్డ్ వార్ నడుస్తోంది. ఒకరు ఔనంటే ఇంకొకరు కాదని..వీళ్ల వ్యవహారంతో అసలే పీకల్లోతు కష్టాలలో ఉన్న ఆ అగ్రనేతతో సహా పార్టీ సీనీయర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇంతకీ వాళ్లెవరంటే కల్వకుంట్ల కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీష్ రావు.వీళ్లిద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు రాజుకుంటునే ఉన్నాయి. అయినా పరువు కోసం ఇద్దరూ పైకి బాగానే ఉన్నా ఎవరికి వారు సొంత క్యాడర్ ను నమ్ముకుని వారి మద్దతుతో కొనసాగుతున్నారు.ఎప్పుడైతే కేసీఆర్ తన తర్వాత కేటీఆర్ ని యువరాజుగా ప్రకటించారో అప్పటినుంచే ఈ గొడవలు రాజుకున్నాయి. అయితే వార్తా కథనాలను ఇంతకాలం కొట్టిపారేస్తూ వారిద్దరూ ఒకటే అన్నట్లుగా కలర్ ఇచ్చుకుంటూ వస్తున్నారని రాజకీయ పండితులు చెబుతున్నారు. అయితే గత అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల ఓటమి తర్వాత వీరిద్దరూ తలో దారి అన్నట్లుగా పార్టీ శ్రేణులను సైతం పట్టించుకోవడం లేదని టాక్. పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వలస వెళుతున్నవారిని సైతం వీరిద్దరిలో ఏ ఒక్కరూ వారించడం లేదు. పైగా వెళ్లిపోయిన వారిలో ఎవరి వర్గం అనుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారని పార్టీ వర్గాలే బాహాటంగా చర్చించుకుంటున్నాయి. వీళ్లిద్దరినీ సమన్వయ పరచడం అగ్రనేత కేసీఆర్ వలన కూడా కావడం లేదు.అయితే వీరిద్దరి మధ్య మరో కీలక పరిణామం విషయంలో కోల్డ్ వార్ నడుస్తోంది. తెలంగాణ శ్రీమంతుడుగా ఉన్న బీఆర్ఎస్ కు చెందిన ఓ ప్రముఖుడి సంస్థకు సంబంధించిన విషయంలో వీరిద్దరి మధ్య పొరపొచ్చాలు మరింత ఎక్కువయ్యాయని టాక్. గతంలో కోకాపేట భూముల వేలం విషయంలో అత్యధిక రేటును సొంతం చేసుకున్న ఆ శ్రీమంతుడు బీఆర్ఎస్ విధేయుడు. ఇటీవల కాంగ్రెస్



శ్రేణులు ఆ శ్రీమంతుడి భూముల వ్యవహారంపై విరుచుకుపడుతున్నారు. అయితే కేటీఆర్ మాత్రం తనని, తన వర్గం వారిని టార్గెట్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు.ఈ విషయంలో హరీశ్ రావు సైలెంట్ గా ఉన్నారు. ఎవరి గురించో మనం ఎందుకు ప్రభుత్వంపై ఫైట్ చేయాలంటూ కేటీఆర్ కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కేటీఆర్ హరీశ్ మాటలు లెక్క చేయడం లేదు. ఇంకా వారిని వెనకేసుకొస్తున్నారు. ఇప్పటికే అగ్ర నేతల చుట్టూ కేసులు చుట్టుముడుతున్నాయి. ఇలాంటప్పుడు వేరే ఎవరి కోసమో మనం ఎందుకు పోరాడాలి అని హరీశ్ రావు సాధ్యమైనంత వరకూ ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ వస్తున్నారు. కానీ కేటీఆర్ మాత్రం తమ అనునాయులను వెనకేసుకొస్తూ వారి కోసం అధికార పక్షంతో గొడవలు పెట్టుకుంటున్నారు.పైగా తన సొంత మీడియాలో కూడా హరీశ్ రావు కు సంబంధించిన వార్తలు ఏమీ కవర్ కానీయకుండా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. హరీష్ రావుకు సంబంధించిన వార్తలన్నీ లోపల పేజీలలో కానీ అసలు వెయ్యకపోవడం కానీ చేస్తున్నారు. ఇలా ప్రతి అంశంలోనూ ఇద్దరి మధ్య నడుస్తున్న వ్యవహారంతో కేడర్ అన్యాయమైపోతోంది. ఒకరి మీటింగ్ కు మరొకరు గైర్హాజరవుతున్నారు. గ్రూపుల వారీగా విడిపోతున్నారు. మరి ఈ విషయంలో కేసీఆర్ ఏదైనా కఠిన నిర్ణయం తీసుకుంటారేమో అని అంతా ఎదురుచూస్తున్నారు.

# సుంకిశాల ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే



**నల్గొండ :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందించేందుకు మొదలైన సుంకిశాల ప్రాజెక్టు నిత్యం వార్తల్లో నిలుస్తోంది. ఈ ప్రాజెక్టులో ఈ నెలారంభంలో జరిగిన సంఘటనతో పంప్ హౌజ్ మొత్తం నీటితో నిండిపోయింది.ఇన్టేక్ వెల్ రక్షణ గోడ కూలిపోయిన సంఘటనతో పనులు నిలిచిపోయాయి. సాగర్ రిజర్వాయర్ కనిష్ట మట్టానికి నీరు చేరితే కానీ తిరిగి సొరంగం, ఇతర పనులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 2వ తేదీన రక్షణ గోడ కూలిపోయి సుమారు రూ.20కోట్ల నష్టం వాటిల్లింది. ఈ సంఘటనను అటు జలమండలి అధికారులు, ఇటు మేఘా ఇంజనీరింగ్ సంస్థ గోప్యంగా ఉంచాయి.సోషల్ మీడియాలో వచ్చాక కానీ, ఈ సంఘటన ప్రభుత్వం దృష్టికి రాలేదు. దీంతో విపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎంలు విరుచుకు పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో హడావిడిగా తమకు అనుకూలమైన కాంట్రాక్టు సంస్థకు అవసరం లేని ప్రాజెక్టును రూ.2,215 కోట్లతో మొదలు పెట్టిందని కాంగ్రెస్ ప్రతివిమర్శలకు దిగింది. ఈ సంఘటనపై నిజా నిజాల నిగ్గు తేల్చేందుకు నియమించిన కమిటీ తన రిపోర్టును ప్రభుత్వానికి అప్పగించింది.ఈ రిపోర్టును పరిశీలించాక ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. నలుగురిపై వేటు ఈ సంఘటనకు బాధ్యులను చేస్తూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని సుంకిశాల ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ ను ఆ పోస్ట్ నుంచి తప్పిస్తూ బదిలీ వేటు వేసింది. ఈ ప్రాజెక్టుకే చెందిన సీజీఎం కిరణ్ కుమార్, జీఎం మరియ రాజ్, డీజీఎం ప్రశాంతం, మేనేజర్ హరీష్ లను సస్పెండ్ చేసింది.నిర్మాణ పనులు చేస్తున్న సంస్థకు షో కాజ్ నోటీసు కూడా ఇచ్చారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారని అధికార వర్గాల ద్వారా తెలసింది.వాస్తవానికి ఇపుడు హైదరాబాద్ కు పుట్టంగండి (ఎ.ఎం.ఆర్.పి) ద్వారా తాగునీరు అందిస్తున్నారు. అయితే, సాగర్ లో 510 అడుగులకు నీటి మట్టం చేరితే పుట్టంగండి నుంచి నీటిని తీసుకోలేక ప్రత్యేక మోటార్ల ద్వారా ఎత్తిపోయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అసలు, ఏఎంఆర్పీ నుంచి కాకుండా ప్రత్యేకంగా తాగునీటి ప్రాజెక్టును చేపట్టాలని నాటి ప్రభుత్వం సుంకిశాలకు శ్రీకారం చుట్టింది.ఇక్కడి నుంచే అయితే, నాగార్జున సాగర్ లో 462 అడుగుల నీటిమట్టం ఉన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు తీసుకోవచ్చు. ఈ మేరకు రూపుదిద్దుకున్న సుంకిశాల ఇన్టేక్ వెల్ కు మూడు టన్నెళ్ళను ఏర్పాటు చేశారు. రిజర్వాయరు నుంచి నీరు రాకుండా ఈ టన్నెల్లను మట్టితో మూశారు. ఇదే టన్నెళ్లకు సంబంధించి 504 అడుగల వద్ద టన్నెల్ కు గేటు ఏర్పాటు చేశారు. ఈ పనులు చేయడానికి టన్నెల్ లోకి నీరు రాకుండా అడ్డువేసిన మట్టిని తొలగించారు.అయితే, పనులు జరుగుతున్న గత 29, 30, 31 తేదీల్లోనే సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద విపరీతంగా వచ్చింది. దీంతో సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఇంత నిండుగా నీరున్నా అతి విశ్వాసంతో పనులు చేయడం వల్లే అసలు సమస్య ఏర్పడిందని విచారణ కమిటీ గుర్తించింది. ఒక వేళ మట్టిని తొలగించకుండా, అసలు ఇపుడే గేట్ ఏర్పాటు పనులు చేపట్టకుండా ఉండి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని విచారణ కమిటీ తేల్చింది.వాస్తవానికి జలమండలి అధికారుల కంటే, నిర్మాణ సంస్థకు చెందిన ఇంజనీర్ల అత్యుత్సాహం కొంప ముంచిందంటున్నారు. దీనికి తోడు వాటర్ బోర్డ్ అధికారులు సైతం పనులకు అభ్యంతరం చెప్పకపోవడం కూడా సమస్యగా మారింది. ప్రస్తుతానికి కొందరిపై చర్యలు తీసుకున్నా మరో ఉన్నత స్థాయి విచారణ కూడా చేపట్టనున్నారు.

# రిటైరైన ఉద్యోగులకు 150 కోట్లా



**వరంగల్ :** రాష్ట్రంలో రిటైరయిన ఉద్యోగులు ఇంకా ప్రభుత్వ పదవులలోనే కొనసాగుతున్నారు. వారిపై రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ150 కోట్లు ఖర్చుపెడుతోంది. దాదాపు వీళ్లు పదేళ్లుగా రిటైరయిన పదవులనే పట్టుకుని వేళ్లాడుతున్నారు. వీళ్ల అలవెన్సుల మీద ఇప్పటి దాకా ఈ పదేళ్లలో రూ.18 వేల కోట్లకు పైగా ఖర్చుచేశారని తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర సర్కార్ పై మండిపడుతున్నాయి. ఈ సందర్భంగా ఉస్మానియా జాయింట్ యాక్షన్ కమిటీ తరపున శ్రీకాంత్ యాదవ్ ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు.రేవంత్ రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రిటైరయిన ఉద్యోగులను తొలగించి నిరుద్యోగ యువకులతో ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. వీళ్ల వలన గత పదేళ్లుగా ప్రమోషన్లు లేక చాలా మంది ఉద్యోగులు బాధపడుతున్నారని గుర్తుచేశారు. ఇటు ఉద్యోగులు, అటు నిరుద్యోగులు రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఆందోళనగా ఉన్నారని..ఇప్పటికైనా అటువంటి వారిని గుర్తించి వారిని తొలగిస్తే నిరుద్యోగులకు వేలు చేసినవారవుతారని అన్నారు. పైగా రిటైరయిన ధీమాతో లంచాలకు మరిగి అక్రమంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అన్నారు. ఎప్పటినుంచో పదవులలో కొనసాగడం వలన వీళ్లకు ప్రభుత్వ ఆదాయానికి ఎలా గండి కొట్టవచ్చో అక్రమ లొసుగుల ద్వారా సంపాదించుకుంటున్నారని..ఇటువంటి వారిని ఉపేక్షించరాదని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఎనిమిది నెలలు కావొస్తున్నా..రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు పై దృష్టి పెట్టకపోవడం శోచనీయం అన్నారు.ఇప్పటికీ రిటైరయిన కొందరు ఉద్యోగులు కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో కొనసాగుతునే ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం కూడా ఈ రిటైరయిన ఉద్యోగుల తొలగింపు విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గతంలో విద్యార్థి సంఘాల తరపున ప్రభుత్వం పై తెచ్చిన ఒత్తిడితో ఇప్పటిదాకా వెయ్యి కి పైగా రిటైర్డ్ ఉద్యోగులను గుర్తించారు.

# డీఎస్సీలో 1:3 నిష్పత్తిలో ఫైనల్ సెలక్షన్



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల ప్రిలిమినరీ ఆన్సర్ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. కీ పై అభ్యంతరాల స్వీకరణకు గడువు ఆగస్టు 20వ తేదీగా నిర్ణయించింది. జులై 18న ప్రారంభమై డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు ఆగస్టు 5 తేదీతో ముగిశాయి. డీఎస్సీకి మొత్తం 2,79,957 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 2,45,263 మంది అంటే 87.61 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. దాదాపు 34,694 మంది పరీక్షలకు దూరంగా ఉన్నారు. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (రాఉ) పోస్టులకు 92.10 శాతం హాజరు నమోదైంది. అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఫైనల్ ఆన్సర్ కీ తయారు చేసి, ఫలితాలను వెల్లడించేందుకు విద్యాశాఖ కార్యచరణ రూపొందించింది. ఈ మేరకు ఉపాధ్యాయ నియామక ప్రక్రియను సెప్టెంబర్ ఆఖరి వారం నుంచి మొదలు పెట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఆగస్టు నెలాఖరుకు తుది ఆన్సర్ కీ విడుదల చేసేందుకు కసరత్తులు చేస్తుంది.జిల్లాల వారీగా పోస్టులు, డీఎస్సీ పరీక్ష రాసిన వారి వివరాలను క్రోడీకరిస్తున్నారు. రోస్టర్ విధానం, వివిధ కేటగిరీ పోస్టుల విభజనపై అధికారులు దృష్టి సారించారు. ఈసారి డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించినందున ఫలితాలను తేలికగా వెల్లడించే వీలుందని అధికారులు చెబుతున్నారు. ఫైనల్ కీ విడుదలైన రోజే లేదంటే ఆ మరుసటి రోజు ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. అనంతరం వారం రోజుల్లో సీనియారిటీ జాబితాను రూపొందించి మెరిట్ జాబితా వెల్లడిస్తారు. రోస్టర్ విధానం, జిల్లాల వారీగా పోస్టులకు సంబంధించిన డేటా, ఇతర అంశాలన్నీ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ పరిధిలోనే చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతీ జిల్లాలోనూ టీచర్ పోస్టుకు ముగ్గురు చొప్పున మెరిట్ పద్ధతిన ఎంపిక చేసి, ఆ జాబితాను మాత్రమే జిల్లా కేంద్రాలకు పంపాలని నిర్ణయించారు. జిల్లా ఎంపిక కమిటీ ఈ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేస్తుంది. వ్యక్తిగత వివరాల విచారణ నివేదికలను తెప్పించేందుకు అన్ని జిల్లాల పోలీసు అధికారులకు కేంద్ర కార్యాలయం నుంచే జాబితాలను పంపించేలా కార్యచరణ రూపిందిస్తున్నారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ మూడోవారంలో ముగించి, జిల్లా కేంద్రాల్లో నియామక ప్రక్రియను నాలుగోవారం నుంచి మొదలుపెట్టాలని భావిస్తున్నారు.వేళ ఇదంతా అనుకున్నట్లు జరగకపోతే అక్టోబర్ మొదటి వారంలో నియామక ప్రక్రియ ఉండవచ్చని విశ్వాస వర్గాలు తెలిపాయి. మొత్తం చూస్తే అక్టోబర్ చివరి నాటికి నియామక ఉత్తర్వులను అభ్యర్థులకు అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కొత్తగా భర్తీ చేసే ఉద్యోగాలన్నింటికీ షెడ్యూ ల్డ్ కులాల ఉప వర్గీకరణను అమలు చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అవసరమైతే ఆర్డినెన్స్ కూడా తెస్తామన్నారు. అయితే, డీఎస్సీ నోటిఫికేషన్‌ను వర్గీకర ణపై తీర్పు రాక ముందే ఇచ్చారు గనుక ఈ నియామకాలకు వర్గీకరణ అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి సమాధానం రాలేదు.